కథా నిలయం
శ్రీకాకుళం

# తొమ్మిదింట ఒకటి

"ఇదిగో చంద్రవతీ! నీ కిదే చెప్తున్నా ఇక నుంచి నువ్వా అమ్మాయితో కలిసి తిరిగితే ఊరుకోను చెబుతున్నా... నీ ఇష్టం."

".... .... .... ...."

"చెప్పిన మాట వినకపోతే మీ నాన్నగారికి చెప్పాల్సొస్తుంది. ఆయనచేత చెప్పించుకోవాలనుకుంటే గాయత్రితో తిరుగు." హెచ్చరింపుగా అన్నది చంద్రావతి తల్లి.

తల్లి హెచ్చరింపుకు సమాధానం ఏమీ చెప్పకుండానే తన గదిలోకి వెళ్లి మంచం మీద పడుకున్న చంద్రావతి గాయత్రిని గురించి ఆలోచించటంలో మునిగిపోయింది.

* * * *

"ఈసారి గాయత్రి మన ఇంటికి వస్తే నేనే చెప్తాను ఇక నుంచి మా అమ్మాయి కోసం రావద్దని. ఆడపిల్ల, ఆడ లక్షణాలు ఏ మాత్రం లేకుండా ఏమిటీ...?" ఛీత్కారంగా అన్నది రుక్మిణి వాళ్ల అమ్మ.

"నువ్వలా ఏం చెప్పొద్దు. నేనే ఏదోటి చెప్పి తను మనింటికి రాకుండా చేస్తాన్లే." అసహనంగా చెప్పిన రుక్మిణి, తన స్నేహితురాలు గాయత్రిని గురించి ఇంట్లో వాళ్లంతా ఇలా చులకనగా మాట్లాడుకోవడం ఎంతవరకు సమంజసమో అర్థం కాక, అన్యమనస్కంగానే స్నేహితురాల్ని గురించిన ఆలోచనల్లోకి వెళ్లింది.

* * * *

"ఏమో గాయత్రంటే ఇప్పటి వరకూ ఉన్న అభిప్రాయం, అభిమానం అన్నీ పోయినై. మితిమీరితే ఏదైనా వెగటుగానే ఉంటుంది. ఎంతైనా మరీ అంత బరితెగించటం ఏమిటి?

ఇంట్లో పెద్ద వాళ్లు కూడా అసలు ఏమీ పట్టించుకోవటం లేనట్లుంది. ఏమోలే మనకెందుగ్గానీ, నువ్వు మాత్రం ఇక ఆ పిల్లతో స్నేహం చేయకమ్మా, చిట్టీ!" మురిపెంగా చెప్పింది వనజ వాళ్ల వదిన.

అలవాటు ప్రకారం అర్ధగంట ఆలస్యంగా కాలేజీకి చేరిన గాయత్రి, ప్రతిరోజు ఫస్ట్ పీరియడ్ ఎగ్గొట్టి కూర్చునే చెట్టు వద్దకు చేరి, అక్కడ ఒక్కరూ కనిపించకపోవటంతో ఆశ్చర్యపోయింది. క్లాసుకు గైరుహాజరవుతే అవుతారు. కానీ ఆచెట్టు క్రిందకు చేరటానికి మాత్రం ఏ ఒక్కరూ బద్ధకించరు ఏరోజూ. అలాంటిది తన మిత్ర బృందంలో ఒక్కరు కూడా అక్కడ లేకపోవటం గాయత్రికి ఆశ్చర్యంతోపాటు అనుమానాన్ని, భయాన్ని కూడా కలుగజేసింది. ఆలోచిస్తూనే కాలేజీ క్యాంటీన్‌లోనూ, కాలేజీకి ఎదురుగా ఉండే లేడీస్ కార్నర్ ఫ్యాన్సీ షాపులో, కొంచెం అవతలగా ఉన్న కూల్‌డ్రింక్ షాపులోనూ, మొక్కజొన్న కండెలమ్మే బండి దగ్గరా, అలా అలా వెతికిందే గాని క్లాసు రూమువైపు ఒక్కసారయినా తొంగిచూడలేదు. ఆ సమయంలో వాళ్లెవరూ క్లాసులో ఉండరని ఆ అమ్మాయి నమ్మకం అది. నిత్యం జరిగే సత్యం మరి!

అంతలోనే ఫస్ట్ అవర్ అయిపోవడంతో యథాలాపంగా క్లాసురూపం వైపు దారి తీసిన గాయత్రి స్నేహితురాంద్రంతా క్లాసులో ఉండటం గమనించి విస్మయం చెందటమే కాకుండా, తనలో తనే విసుక్కుంది కూడా.

"ఏమిటీ – ఏమయిది మీ అందరికీ ఈ రోజు? ఎన్నడూ లేని దీ వేళ ఫస్ట్ పీరియడ్ క్లాసుకు వచ్చారేం?" సాధ్యమయినంత వరకు తన విసుగును కనబరచకుండా సౌమ్యంగానే అడిగింది గాయత్రి.

"... ... ..."

"ఏమిటీ, అందరూ అలా ఒక్కసారే మూగమొద్దు లయిపోయారు? దారిలో ఎవరైనా ఏ మందో, మాకో పెట్టలేదు కదా?" వచ్చే నవ్వును బిగపట్టుకుని అడిగింది గాయత్రి.

"పార్టీ ఇవ్వలేదనేగా మీ అలక. ఏం చేయమంటారే? నిన్ననే మీ అందర్నీ కలుసుకుని గ్రాండ్ పార్టీ ఇవ్వాలనుకున్నాను. కాని ఏం చేయమంటారు, అనుకోకుండా మా అక్కా బావా ఊర్నుంచి ఊడిపడ్డారు. ఎంతైనా మా ఇంటికి కొత్త అల్లుడు కదా. ఇంట్లో పనికి సహాయంగా ఉండమన్నది అమ్మ. రాలేకపోయాను. అయామ్ సో సారీ... అఁ... ఇక తీరిందా మీ అలక?" సంజాయిషీ చెప్పుకుంది గాయత్రి.

మిత్ర బృందం అంతా ఒక్క మాటైనా మాట్లాడకుండా వడివడిగా వెళ్ళిపోయారక్కడ్నుంచి.

అప్పుడప్పుడు వారి గ్రూప్‌లో ఎవరో ఒకరు అలగటం, అందుక్కారణం అయినవారు సంజాయిషీలు చెప్పుకోవటం, బ్రతిమలాడుకోవటంతో వాతావరణం మామూలు పరిస్థితికి రావడం ఆనవాయితీ. అందుకు భిన్నంగా అందరూ అలా తనను ఒక్కదాన్ని వెలివేసినట్లు వదిలేసి వెళ్లడం గాయత్రికి దుఃఖాన్ని కోపాన్ని తెప్పించింది. వారి చర్య ఆమె మనసును గాయపరిచింది. ఎంతో సంతోషంగా వచ్చిన తనను తోటి వారంతా అలా నిర్లక్ష్యం చేయడం గాయత్రి సహించలేకపోయింది. ఒంటరిగానే వెళ్లి చెట్టు కింద కూర్చుంది. మరికాసేపు తనను ఏడిపించి, ఆట పట్టించి ఎలాగైనా వారంతా తన దగ్గర కొస్తారని ఆమె ఆశ, రావాలని కోరిక. అందుకే అలా చాలాసేపు ఒంటరిగా కూర్చుండిపోయింది.

"హాల్లో గాయత్రీ. కంగ్రాట్స్ ఏమో అనుకున్నాం గానీ నిజంగా అదరగొట్టేశావ్! మాంచి మజాగా ఉందిలే నీకథ... నిన్ననే చదివాను." నవ్వుతూ చెప్పింది మరో క్లాస్‌మేట్ సునంద.

"నిజంగానే గాయత్రి... మీ కథ చాలా బాగుంది. ప్రొసీడ్." అభినందించింది కల్పన.

చిరునవ్వుతో ఇద్దరికీ థ్యాంక్స్ చెప్పింది గాయత్రి. మామూలుగా అయితే వాళ్లతో మనసు విప్పి మాట్లాడేదే కానీ, నిరుత్సాహంగా ఉన్న గాయత్రి అప్పటికి అంతకంటె ఎక్కువ మాట్లాడలేకపోయింది వాళ్లతో. ఎంతసేపటికీ ఆమె ఎదురుచూస్తున్న మిత్ర బృందం రాకపోయేసరికి చిరాకనిపించి ఇంటికి బయలుదేరింది గాయత్రి.

తనతో సన్నిహితంగా ఉండే మరో ఇద్దరు క్లాస్‌మేట్స్ కనిపించారు దారిలో గాయత్రికి. ఆ ఇద్దరూ పదకొండు గంటల సినిమా చూసి కాలేజీకి వెళ్తున్నారు. మధ్యాహ్నం క్లాసులకయినా హాజరవ్వాలని.

"ఏమిటీ మీ బ్యాచ్ అందరూ థియేటర్ దగ్గరుంటే నువ్వొక్కదానివి వస్తున్నావు". అడిగింది ఆ ఇద్దర్లో ఒక అమ్మాయి - నీలిమ.

"ఆఁ.. తలనొప్పిగా ఉంటేనూ..." చెప్పింది.

"అవును గానీ, నువ్విలా రా ఓ మాట" అంటూ గాయత్రి చెయ్యి పట్టుకుని మిగిలిన స్నేహితురాలకు దూరంగా తీసుకు వెళ్లింది నీలిమ.

గాయత్రి స్నేహితులు ఆమెపై అలగటం, తనతో మాట్లాడకపోవటం అన్నీ తనకు తెలుసునన్నట్లు చెప్పింది నీలిమ. అంతేకాదు; వారికపై గాయత్రితో మాట్లాడదలచుకోలేదని, ఆమెతో స్నేహం కోరుకోవటంలేదని కూడా చెప్పింది.

ఆ మాటలు వింటూనే నిశ్చేష్టురాలయిన గాయత్రి తన స్నేహితురాండ్రకు తనపై అంతటి ద్వేషం కలగటానిక్కారణం కూడా నీలిమ ద్వారా విని అప్రతిభురాలయింది. ఆమెకు ఏం మాట్లాడాలో తోచలేదు. ఆమె మనసు అసలు ఏమీ ఆలోచించగలిగిన స్థితిలో లేదు.

గాయత్రి పరిస్థితి అర్థం చేసుకున్న నీలిమ "సాయంత్రం ఇంటి వద్ద కలుస్తా"నని చెప్పి వెళ్లిపోయింది.

నిస్తేజంగా, నిస్సత్తువగా ఇంటివైపు దారి తీసింది గాయత్రి.

గాయత్రి ఓ వర్ధమాన రచయిత్రి. సుమారు పాతిక కథల వరకు వివిధ వార, మాస పత్రికల్లో ప్రచురించబడినై. నాలుగైదు బహుమతులు కూడా పొందింది. తన కథలకు ఇరుగు పొరుగు, బంధువర్గం, స్నేహితులు, శ్రేయోభిలాషులు అందరి దగ్గరా రచయిత్రిగా గుర్తింపు, అభిమానం సంపాయించింది.

డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్న గాయత్రికి స్నేహితులు ఎక్కువ మందే ఉన్నారు. స్వతహాగా ఆమెకున్న చొరవ, ఎదుటి వారిని నొప్పించకుండా మాట్లాడగల నేర్పరితనం, పెద్దల మెప్పు పొందగల వినయ విధేయతల మూలంగా పరిచయాల్ని, స్నేహాల్ని సునాయాసంగా చేసుకోగలదు గాయత్రి.

చిన్నప్పటి నుంచి కలిసి చదువుకున్న చంద్రావతి, రుక్మిణి, మధ్యలో పరిచయం అయినా మనసులు కలిసిన వనజ, నీలిమ గాయత్రికి ముఖ్యమైన స్నేహితులు. అందరి ఇళ్ళల్లోనూ కలివిడిగా తిరగడం, దాపరికం లేకుండా మాట్లాడటం గాయత్రికి అలవాటు.

తనురాసిన కథలు చాలా వరకు ప్రచురణ కాకముందే చదివేస్తుంటారు గాయత్రి ప్రాణస్నేహితులు. అడపాదడపా వారికి చూపించకుండానే పత్రికలకు పంపుతుంటుంది గాయత్రి.

ఇటీవల గాయత్రి తనింతవరకు రాయని అంశం కథావస్తువుగా ఎంచుకుని ఒక కథ వ్రాసి ఏదో పత్రికకు పంపడం, వారు ప్రచురించటం కూడా జరిగింది. ఆ కథలో గాయత్రి సరస, శృంగారాలను, భార్యా, భర్తల పడక గది ముద్దు ముచ్చట్లను కొంచెం శ్రుతిమించే రాసింది. కాని దాని ప్రభావం ఇలా ఉంటుందని ఊహించలేదు పాపం. ఓ రచయిత్రిగా ఇలాంటి ప్రయత్నం మాత్రం ఎందుకు చేయకూడదనే ఉద్దేశ్యంతో మాత్రమే రాసిన గాయత్రికి ఊహించని పరిణామాలు ఎదురైనయ్.

పెళ్లీడు వచ్చిన ఆడపిల్ల అలాంటి అసభ్యకరమైన కథలు రాయడం మంచిది కాదని, అలాంటి కథ రాసినందుకు నలుగురూ నాలుగు రకాలుగా

అనుకుంటారని తన ఇంట్లో వాళ్లే మందలించారు. ఆ విషయంలో వారలాంటి భయానికి లోను కావటం అసహజం అనిపించకపోయినా అసమంజసం అని మాత్రం అనుకుంది గాయత్రి.

రచయిత్రిగా ఎన్నో కథల్లో ఎన్నో సమస్యలకు రకరకాల పరిష్కారాలు చూపించిన గాయత్రి, నిజ జీవితంలో ఇలాంటి ఇబ్బందులు ఎదుర్కోవడం కష్టమనే అనుకుంది. కోరి అలాంటి కష్టాల్ని కొనితెచ్చుకోవడం అవివేకం అని కూడా అనిపించింది.

కాని తన స్నేహితులుకూడా తనతో సూటిగా, నిస్సంకోచంగా, సూచనలు, సలహాలు ఇస్తే ఎంతో సంతోషించేది గాయత్రి. వాళ్ళ భయం అర్థరహితమైనా, తన కోసం వాళ్ళు పడే బాధలో ఉన్న అభిమానానికి ఆమె కట్టుబడి ఉండేది.

వ్యక్తిగతంగా ఎలాంటి నష్టం లేకపోయినా, రచయిత్రిగా, సమాజానికి సహాయపడే రచనలు చేయగల రచయిత్రిగా రూపుదిద్దుకోవలసిన తను ఇలాంటి కథలు రాయటం ద్వారా తిరోగమించటమే అవుతుందన్న వాదాన్నీ మనస్ఫూర్తిగా అంగీకరించింది గాయత్రి.

కాని కేవలం అలాంటి ఒకే ఒక్క కథ రాయడం మూలంగా తన వ్యక్తిత్వాన్ని అనుమానించి ఎన్నాళ్లుగానో పెంచుకున్న స్నేహ బంధాన్ని తెంపుకోవటం ఎందుకో సహించలేకపోయింది గాయత్రి. అలాంటి కథలు రాయవద్దంటూ గాయత్రికి సలహా చెప్పినవారూ లేకపోలేదు.

ఇన్నాళ్లూ తనలో వారికి కనిపించని లోపాలన్నీ ఆ కథ చదివాక ఏర్పడటం గాయత్రికి విచిత్రంగా తోచింది. ఆ ఒక్క కారణంగా తనతో స్నేహం చేయడానికి అయిష్టం చూపటం అనుచితం అనిపించింది గాయత్రికి.

'ఎన్నో క్రైమ్ కథలు, నవలలు రాసే రచయిత(త్రు) లందరివీ క్రిమినల్ బ్రెయిన్స్ అనటం ఎంత హాస్యాస్పదమో, సరస, శృంగారాలు రాసేవారి మనసుల్లో ఎప్పుడూ అవే ఆలోచనలుంటాయనుకోవటం కూడా అంతే.' మనసులోనే అనుకున్నది గాయత్రి.

రచన అనేది ఓ కళ అయినప్పుడు, నవరసాల్లో ఒకటి అయిన శృంగారాన్ని రాయడంలో తప్పేముంది? శ్రుతిమించి రాయటం పొరపాటని గ్రహించిన గాయత్రి మరోసారి ఆ పొరపాటు పునరావృతం కాకుండా జాగ్రత్త పడాలని నిశ్చయించుకుంది.

◆ ఆంధ్రప్రభ - ఏప్రిల్ 22-28, 1992 ◆